మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



అతడి ప్రవర్తన చూసి
## దూరం పెట్టా
- మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్

4

సంపుటి : 01 | సంచిక : 66 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 03 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికకు పకడ్బందీ
# ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

3 లో





# పరీక్షలకు సిద్ధం కావాలి
- జిల్లాకు మంచి పేరు తేవాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు పక్కా కార్యాచరణ పెట్టుకొని బాగా ప్రిపేర్ అవ్వాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. స్టేషన్ ఘన్పూర్ లోని బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం సందర్శించారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు వారి ప్రిపేరేషన్ ఎలా జరుగుతుంది అని, ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో ఎలా మార్కులు వచ్చాయాని, ఏఏ సబ్జెక్ట్ లను ఎంత వరకు చదవడం పూర్తి చేశారు తదితర వివరాలని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుండి అస్సలు సమయాన్ని వృథా చెయ్యద్దని, ప్రతీ సబ్జెక్ట్ పైన పట్టు సాధించి మంచి మార్కులు తెచ్చుకొని జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కిచెన్ గది లోకి వెళ్లి వంట సరుకులను, కూరగాయలని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజన తయారీ ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల దగ్గరికి వెళ్లి ఎలా ఉంది భోజనం అని మెనూ ప్రకారం వండుతున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఆర్డివో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

wanted
విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way



# సిట్ నోటీసులపై బీఆర్ఎస్ ఆందోళన

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఫోన్ టాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకున్నారు. రాస్తారోకో కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిట్ విచారణకు సమయం కోరినప్పటికీ ఇవ్వకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాస గోడకు నోటీసులు అతికించడం సరికాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ రెండు మూడు హామీలు తప్ప మిగిలిన ఏ హామీని అమలు చేయలేదని, ప్రజలను తప్పుదోవ పట్టించి మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికే సిట్ విచారణను ముందుకు తీసుకొచ్చిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగ రవి, మాజీ ఎంపీపీ జక్కుల అనిత, మండల అధ్యక్షుడు మండల సురేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల పనుల పర్యవేక్షించిన కలెక్టర్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఆఫీస్ ని సందర్శించి మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలకు సంబందించిన పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీ సిబ్బందితో ఎన్నికలకు సంబంధించి వివిధ విభాగాలకు నోడల్ ఆఫీసర్స్ ను నియమించమని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్ ను సందర్శించి అధికారులకు పలు సూచనలను ఇచ్చారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ని సందర్శించి అక్కడ నిర్వహించే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను పర్యవేక్షించి తగు జాగ్రత్తలను తీసుకోవాల్సిందిగా తెలిపారు.



# జడ్పీ స్కూల్‌ను పరిశీలించిన అడిషనల్ కెలక్టర్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ ను అదనపు కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి పింకేష్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు అంటే భయపడవద్దని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఇప్పటివరకు ఉన్న సమయంలో అన్ని సబ్జెక్టులని ప్రిపరేషన్ అవ్వాలని సబ్జెక్టులలో ఏమైనా భయం ఉంటే సబ్జెక్టు టీచర్స్ కి తెలిపి నివృత్తి చేసుకోవాలని మంచిగా ప్రిపేర్ అయి అందరూ పాస్ కావాలని సూచించారు. అలాగే పాఠశాలలోని టీచర్లతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలల ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశంలో ఐడియా అఫ్ షేరింగ్ హార్డ్ టు ఈజీగా సబ్జెక్టు బోధన ఉండే విధంగా చర్చించుకొని సబ్జెక్టు సమస్యలను నివృత్తి చేసుకొని తరగతి గదిలో అమలు చేయాలని గణిత ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమం లో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ రెడ్డి, పాఠశాల ఇన్చార్జి హెడ్మాస్టర్ బి నాగభూషణం, సి ఆర్ పి కనకయ్య, గణిత కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ సారాబు శ్రీనివాస్, ఆర్ పి అంకం రవీందర్ పాల్గొన్నారు.



# వీరభద్రుని దర్శించుకున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య


**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కొత్తకొండ వీరభద్ర స్వామి సమేత భద్రకాళి దేవాలయాన్ని ఎమ్మెల్సీ బసవరాజు దంపతులు ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆదివారం పౌర్ణమి, విశేషమైన వీరభద్రుని రోజును పురస్కరించుకుని స్వామి వీరన్న, భద్రకాళి దేవికి మొక్కుకున్న మొక్కులను వారు చెల్లించారు. ఈ సందర్భంగా కొత్తకొండ వీరన్నకు కోడె మొక్కు చెల్లించి, గుమ్మడికాయను తలపై పెట్టుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం గుమ్మడికాయను స్వామివారికి సమర్పించి, కోరమీశంతో కోడె మొక్కును అర్పించారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పి. కిషన్ రావుతో ఫోన్ ద్వారా మాట్లాడిన అనంతరం, ముఖ్య అర్చకులు రాంబాబుతో సమన్వయం చేసి బసవరాజు దంపతులను దేవస్థానం తరఫున ఘనంగా స్వాగతించారు. దర్శనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించి, దేవస్థానం తరఫున శేషవస్త్రాన్ని అందజేసి వేద ఆశీర్వాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయగా, భద్రతా చర్యల మధ్య బసవరాజు దంపతులకు ఘనంగా వేద ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా కొత్తకొండ దేవాలయ ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు, గుడ్ల శ్రీకాంత్, తాటికొండ వీరభద్రయ్య, అర్చకులు కంచనపెల్లి శరత్ చంద్ర తదితరులు పాల్గొని వేద ఆశీర్వాదాలు చేశారు. ఆదివారం రోజు కొత్తకొండ దేవస్థానం భక్తులతో కళకళలాడింది.

# కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో ముల్కనూర్ విద్యార్థుల ప్రతిభ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సమీపంలో ఉన్న అజ్ఞాత ఫంక్షన్ హాల్‌లో డబ్ల్యుఎఫ్ఎస్‌కేఓ (WFSKO) ఆధ్వర్యంలో కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీతో పాటు సినీ నటులు హాజరై పోటీదారులను ప్రోత్సహించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ముల్కనూర్‌కు చెందిన గురు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అకాడమీ కోచ్ సిరిగిరి సాంబశివ మాట్లాడుతూ, వివిధ విభాగాల్లో విద్యార్థులు మెడల్స్ సాధించి అకాడమీకి మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు.పోటీల్లో బీ. శ్రీకర్ రెడ్డి కాటా, ఫైట్ విభాగాల్లో పాల్గొని గోల్డ్ మరియు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ. దీక్షిత్ కాటా విభాగంలో గోల్డ్, ఫైట్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించగా, ఎం. అయాన్ కాటా విభాగంలో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జి. రిషికాంత్ కాటా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. విజయం సాధించిన విద్యార్థులను టోర్నమెంట్ ఆర్గనైజర్‌తో పాటు గ్రాండ్ మాస్టర్ సిరిగిరి తిరుపతి అభినందించారు. భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్లలో కూడా ఇలాగే మెరుగైన ప్రదర్శన కనబర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.




# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ క్లస్టర్ పరిధిలో ఉన్న 108, 102,1962 వాహనాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి మెదక్ జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బోయిని సంపత్ సూచించారు. శనివారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని 108, 102,1962 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల, సిబ్బంది పనితీరును పరిశీలించారు. హుస్నాబాద్ క్లస్టర్ లో ఉన్న 108 102 1962 సేవలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని,ప్రజలకు మెరుగైన సేవల అందిస్తూ వాహనాల వినియోగం ప్రజలకు తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది రాజు, సతీష్, జగన్,రాజు, 102 సిబ్బంది శ్రీధర్, 1962 సిబ్బంది సృజన్, డాక్టర్ ప్రవళిక, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ముల్కనూర్ సమ్మక్క జాతర

# ఆదాయం రూ.8.67 లక్షలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ముల్కనూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించిన హుండీ కౌంటింగ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.8,67,296 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీ కౌంటింగ్‌లో నోట్ల రూపంలో రూ.7,25,155, నాణేల రూపంలో రూ.1,29,161, చినిగిన నోట్లుగా రూ.4,000, తడిచిన నోట్లుగా రూ.8,980 లభించాయి. అలాగే హుండీలో మిశ్రమ వెండి 249 గ్రాములు, మిశ్రమ బంగారం 390 మిల్లీ గ్రాములు కూడా వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ కౌంటింగ్ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు డి.అనిల్, ఉత్సవ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, భక్తులు, పూజారులు, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. లభించిన నగదు, ఆభరణాలను ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్యలకు అందరి సమక్షంలో అప్పగించినట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి పి.కిషన్ రావు తెలిపారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికకు

# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**వరంగల్, మన చౌరాస్తా :** మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ, ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం ఇవ్వకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి పూర్తిగా అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లకు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే పూర్తి సమాచారం అందించాలని, పోలింగ్ నిర్వహణ నుండి లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను సక్రమంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ వాసుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.




## వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు

# బడ్జెట్ పెంచాలి

- **ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

**వరంగల్, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే విధంగా ఉందని తక్షణమే బడ్జెట్ ను సవరించి దేశీయ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి గ్రామీణ మౌలిక సదుపాయాలకు ఉపాధికి నిధులను పెంచాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈరోజు ఎంసిపిఐ(యు) నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ వరంగల్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వికసిత్ భారత్ పేరుతో ప్రచార ఆర్భాటం చేస్తూ లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఆచరణలో సంస్కరణల వేగవంతం పేరుతో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగాలను సంపదను ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్ర పన్నిందని ఈ క్రమంలో పట్టణీకరణ పేరుతో వివిధ రకాల సేవలను రద్దుచేసి కమర్షియల్ గా మార్చి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో దేశ ప్రయోజనాలకు అభివృద్ధికి అనుగుణంగా సమతుల్యత పాటించి కేటాయింపులు జరపాలని ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర ప్రతాప్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్ ముక్కెర రామస్వామి ఏరియా కార్యదర్శులు ఐతం నాగేష్ మహమ్మద్ మెహబూబ్ పాషా పరిమళ గోవర్ధన్ రాజు నగర నాయకులు మాలి ప్రభాకర్ అప్పనపురి నర్సయ్య నలివెల రవి జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు వరంగా

# అమ్మ ఒడి పథకం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** అమ్మ ఒడి పథకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణకు ఉద్దేశించిన అమ్మ ఒడి పథకం గర్భిణీ స్త్రీలకు వరంగా మారిందని పైలట్ బైరి శ్రీధర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ మండల కేంద్రం లోని ఏరియా హాస్పిటల్లో ఈ పథకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల గర్భిణీ స్త్రీలు అమ్మ ఒడి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు 102 సేవకు కాల్ చేస్తే, వారి ఇంటి వద్దకే వాహనం వెళ్లి వారిని ఏరియా హాస్పిటల్, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వరకైనా తరలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తిరిగి అదే వాహనంలో క్షేమంగా ఇంటి వద్ద దింపడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో గర్భిణీ స్త్రీలకు ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈఎంఈ హారిరామకృష్ణ, ప్రోగ్రాం మేనేజర్ బోయిని సంపత్‌తో పాటు తదితరులు ఉన్నారు.






## సేవాలాల్ జయంతిని సెలవు

# దినంగా ప్రకటించాలి

- **మైసమ్మతండా సర్పంచ్ కృష్ణానాయక్**

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** గిరిజనుల ఆరాధ్య దైవం అయిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వ హించాలని అక్కన్నపేట మండలం మైనమ్మవాగుతండా సర్పంచ్ భూక్య కృష్ణానాయక్ అన్నారు. సోమవారం రోజున ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా ఫిబ్రవరి 15వ తేదీన సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించుకుంటామని, అయితే గత ప్రభుత్వం ఈ జయంతి వేడుకలు నిర్వహించేందుకు తండాలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసేదని, గత ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు గిరిజనుల అభివృద్ధికి ముందుకు రావాలని కోరుతూ హుస్నాబాద్ శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## అతడి ప్రవర్తన చూసి

# దూరం పెట్టాను

### మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్

కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేవి బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ..' ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**